క్లుప్తంగా

గిరిప్రదక్షిణ రోడ్డు అభివృద్ధికి వైవీ సుబ్బారెడ్డికి వినతి

మర్రిపాలెం: టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని సోమవారం 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. తాటిచెట్లపాలెం అభయాంజనేయస్వామి ఆలయానికి వచ్చిన ఆయనను కలిసి వార్డులోని మాధవధారలో ఉన్న గిరిప్రదక్షిణ రోడ్డు కోసం వివరించి అభివృద్ధి చేయాలని వినతిపత్రం అందించారు.

హైవేలో రెండు రోడ్డు ప్రమాదాలు



స్కూటీ ఢీకొట్టడంతో దెబ్బతిన్న కారు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై సోమవారం రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. శాంతిపురం రహదారిపై ఓ కారును అతివేగంగా వచ్చి స్కూటీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు సైడ్ భాగం దెబ్బతింది. స్కూటీతో ఢీకొట్టిన యువకుడి కాలుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మరో ఘటనలో కారును లారీ ఢీకొట్టడంతో కారు వెనుక భాగం నుజ్జునుజ్జయింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. రెండు వర్గాల వారు ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో ఫిర్యాదులు చేశారు.

ప్రమాదకరంగా రహదారి



జగ్గారావు బ్రిడ్జి వద్ద కుంగిన రహదారి

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని జగ్గారావు బ్రిడ్జి వద్ద కల్వర్టు శిథిలమై ప్రమాదకరంగా మారింది. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ నుంచి రామకృష్ణానగర్‌లోకి మలుపు తిరిగే చోట రహదారి కుంగిపోవడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇది ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి తోడు సమీపంలో ఉన్న కూరగాయల బజారుకు వచ్చే వినియోగదారులతో రద్దీగా ఉంటుంది. రాత్రి సమయంలో వాహన చోదకులు గోతిలో పడి గాయాలపాలయ్యే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

20 కేజీల గంజాయి స్వాధీనం




బీచ్ రోడ్డు: అక్రమంగా తరలిస్తున్న 20 కేజీల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. మహారాణిపేట పరిధిలో సింహాద్రి ఆస్పత్రి పక్కన గంజాయి ఉందని వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. నలుగురు వద్ద ఉన్న 20 కేజీల గంజాయి, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు, ఎనిమిది మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు అల్లూరి జిల్లాకు చెందిన కిల్లో ప్రసాద్ రావు, కిల్లో సురేష్ కుమార్, ఒడిశాకు చెందిన సిద్దేష్ కొర, బిహార్‌కు చెందిన అన్వర్‌లను మహారాణిపేట పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన

సీతమ్మధార: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సోమవారం టీడీపీ నాయకులు గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏడు సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని మండిపడ్డారు. అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, ఎ.జగదీస్, బొడ్డేపల్లి లలిత, బర్ల పద్మలత, 14వ వార్డు ప్రెసిడెంట్ గొంప ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు వరం 'ఆసరా'



మూడో విడత వైఎస్సార్ ఆసరా నిధులు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు(ఫైల్)



హర్షం వ్యక్తం చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు, ఆర్పీలు

- మూడో విడత నిధుల విడుదల
- మహిళలకు అండగా సీఎం వైఎస్ జగన్
- 'ఉత్తర'లో 33,249 మంది డ్వాక్రా సభ్యులకు లబ్ధి

సీతంపేట: మహిళలు ఆర్థికంగా ఎదిగిన నాడే సమాజం.. తద్వారా రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని విశ్వసించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పేరిట సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. అందులో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదరికాన్ని నిర్మూలించడానికి, ఉత్పాదకతను మెరుగు పర్చడానికి వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద ఏప్రిల్ 2019 నాటికి డ్వాక్రా సభ్యుల అవుట్ స్టాండింగ్ బ్యాంకు లోన్‌లను నాలుగు వాయిదాల్లో రీయింబర్స్‌మెంట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గత రెండేళ్లు రెండు వాయిదాలను ప్రభుత్వం ఆసరా పథకం కింద రీయింబర్స్‌మెంట్ చేసింది. ఈ ఏడాది కూడా మూడో విడత కింద డ్వాక్రా రుణాల మాఫీ కోసం వైఎస్సార్ ఆసరా నిధులు విడుదల చేశారు.

3,223 సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు..

ఉత్తర నియోజకవర్గంలో కొనసాగుతున్న 3,223 సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల్లో సభ్యులుగా ఉన్న 33,249 మంది డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా ప్రయోజనం లభించింది. సుమారు రూ.20.29 కోట్లు ఆసరా పథకం మూడో విడత నిధులు డ్వాక్రా గ్రూపుల బ్యాంకు ఖాతాలకు జమయ్యాయి. నియోజకవర్గంలోని 17 వార్డుల్లో అత్యల్పంగా 14వ వార్డులో 95 గ్రూపులకు చెందిన 981 మంది సభ్యులకు సుమారు రూ.30 లక్షలు విడుదలయ్యాయి. అత్యధికంగా 24వ వార్డులో 248 గ్రూపులకు చెందిన 2,557 సభ్యులకు సుమారు రూ.2.36 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఇచ్చిన మాట ప్రకారం వరుసగా మూడు సార్లు ఆసరా నిధులు విడుదల చేయడంతో పొదుపు సంఘాల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వార్డుల వారీగా లబ్ధిదారుల వివరాలు

వార్డు నం.	ఎస్‌హెచ్‌జీ గ్రూప్స్	సభ్యులు	నిధులు (రూ.లక్షల్లో..)
14	95	981	30.12
24	248	2,557	236.89
25	226	2,330	125.88
26	195	2,011	226.70
42	172	1,774	157.41
43	264	2,722	180.37
44	237	2,453	101.35
45	223	2,298	96.48
46	159	1,640	106.33
47	161	1,661	124.57
48	190	1,960	110.44
49	216	2,227	165.24
50	184	1,898	92.53
51	230	2,372	118.69
53	149	1,537	96.76
54	160	1,651	100.86
55	114	1,177	77.87
	3,223	33,249	2029.80

మూడు విడతలుగా లబ్ధి



44వ వార్డు రామచంద్రానగర్‌లో ఉంటున్నాను. రాజరాజేశ్వరి మహిళా పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. అక్కచెల్లెమ్మల బ్యాంకు రుణాలు నాలుగు విడతలుగా తీర్చుతానని సీఎం జగనన్న హామీ ఇచ్చారు. ఇప్పటికి రెండు సార్లు నగదు జమ చేశారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద గత రెండేళ్లు రూ.8,700 చొప్పున నా బ్యాంకు ఖాతాలో జమైంది. ఈ ఏడాది మూడో విడతగా రూ.8,700 జమ అయినట్టు తెలిసింది.

– షేక్ రంజాన్ బీబీ, రామచంద్రానగర్

జగనన్నకు రుణపడి ఉంటాం



అక్కయ్యపాలెం శ్రామికనగర్‌లో ఉంటున్నాను. శ్రీశాంతి మహిళా పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. వైఎస్సార్ ఆసరా కింద మూడు సార్లు రూ.10,200 చొప్పున ఖాతాలో జమయ్యాయి. ఇచ్చిన మాట ప్రకారం చెప్పిన సమయానికి ముందే ఆసరా నిధులు విడుదల చేసి మహిళలకు అండగా నిలిచిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– కందివలస లలిత, శ్రామికనగర్

బ్యాంకు ఖాతాల్లో నగదు జమ



44వ వార్డులో పొదుపు సంఘాల రిసోర్స్ పర్సన్(ఆర్పీ)గా పనిచేస్తున్నాను. నా వద్ద మొత్తం 26 సంఘాలు ఉన్నాయి. అన్ని సంఘాలకు ఆసరా నిధుల కింద మూడో విడతగా రూ.5,63,587 జమయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకంలో భాగంగా ప్రతి ఏటా పొదుపు సంఘాల బ్యాంకు ఖాతాల్లో ఆసరా నిధులు జమ చేస్తున్నారు.

– బి.నాగమణి, రిసోర్స్ పర్సన్

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు..'



48వ వార్డులో వృద్ధుడికి సంక్షేమ పథకాలను వివరించి అభివాదం చేస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 48వ వార్డు పల్నాటి కాలనీ, శివలింగపురం, నీలకంఠ నగర్ ప్రాంతాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వంతోపాటు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచే విధంగా లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, జీవీఎంసీ జోన్–5 ఇంజినీరింగ్ ఏఈలు అర్చన, మోహన్, పి.పద్మా, రత్తుల రాంబాబు, జాగారపు నరేష్, శ్రీరామ్, నాగేంద్ర, కనక, డొప్ప శ్రీను, మహేష్, నాయుడు, అప్పారావు, రామ్‌నాయుడు, పార్వతి, అబ్బదం, ఉమా మహేష్, నవీన్, బాబ్జీ, మణి, కోటి, శేఖర్ సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



బాధిత కుటుంబాలకు చెక్కులు అందిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: వైద్యం కోసం వెయ్యి రూపాయలు ఖర్చు దాటిన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్యం అందించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం అనారోగ్య బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలువురు బాధితులకు సుమారు రూ.5.8 లక్షల చెక్కులు అందజేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యాధులు ఆరోగ్యశ్రీ పరిధిలో లేకపోతే సీఎం సహాయ నిధి నుంచి ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీస్, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, యువజన విభాగం రీజనల్ ఇన్‌చార్జి సునీల్, కె.వి.బాబా, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఎండలు బాబోయ్ ఎండలు



సీతంపేట రోడ్డులో చెరకురసం తాగుతున్న యువత



గొడుగు నీడలో ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

సీతంపేట: సూర్యుడు భగభగలాడుతున్నాడు. ఉదయం నుంచి నిప్పులు చెరుగుతున్నాడు. వేడి గాలులతో ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాడు. దీనికి తోడు విపరీతమైన ఉక్కపోత. ఇది నగరంలోని వేసవి ప్రభావం. నిన్న మొన్నటి వరకు ఒక మోస్తరుగా ఉన్న ఎండలు రెండు రోజులుగా తీవ్ర ప్రభావాన్ని చూపడంతో జనం హడలిపోతున్నారు. ఏప్రిల్ మొదట్లోనే ఎండలు మండిపోతుంటే.. మేలో తీవ్రతను తలచుకుని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో నగరవాసులు వేసవి తాపంతో అల్లాడిపోయారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ముందే హెచ్చరించింది. దానికి తగ్గట్టుగానే ఉదయం నుంచి ఎండ వేడిమి అధికంగా ఉండటంతో జనం రోడ్డుపైకి రావాలంటే హడలిపోయారు. కొంత మంది పనులు వాయిదా వేసుకుంటున్నారు. అత్యవసర పనులపై కొంతమంది బయటకు వస్తున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి చెరకు రసం, కొబ్బరి నీళ్లు, ఫ్రూట్ జ్యూస్‌లు, కూల్ డ్రింక్‌లు వంటి శీతల పానీయాలు సేవించడంతో ఆయా షాపులు వినియోగదారులతో కళకళలాడాయి.

'స్పందన'కు 25 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న డీటీ చేతన్



వినతులు పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ రాజు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 25 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని డిప్యూటీ తహసీల్దార్(డీటీ) చేతన్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఖాదర్, సిబ్బంది పాల్గొన్నారు.

జోన్–5కు ఐదు వినతులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ సూపరింటెండెంట్ టి.ఎస్.ఎస్.రాజు స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 01, పబ్లిక్ హెల్త్‌కు 02, ఇంజినీరింగ్ విభాగానికి 02 చొప్పున అర్జీలు ఆయన తెలిపారు. వినతులు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాస్‌వర్మ, టౌన్ ప్లానింగ్ టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ సూపర్‌వైజర్ ఎస్ జనార్దన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా మురుగునీటి నిర్వహణ

ఏయూ క్యాంపస్: మురుగునీటిని సమర్థవంతంగా నిర్వహించడం, పునర్వినియోగంగా మార్చడం ఎంతో అవసరమని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ సంచాలకుడు ఆచార్య శాలివాహన్ అన్నారు. ఐఐపీఈ సమావేశ మందిరంలో 'వేస్ట్ వాటర్ క్యారెక్టరైజేషన్, ట్రీట్‌మెంట్–రీయూజ్' అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం శాలివాహన్ మాట్లాడుతూ మురుగునీటి నిర్వహణ విధానాలు, ప్రాధాన్యతను వివరించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ టి.రాజేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ మురుగునీటి లక్షణాలను శాస్త్రీయంగా తెలుసుకోవడం, శుద్ధి చేసే విధానాలు, పునర్వినియోగం చేయడం ప్రస్తుతం ఎంతో అవసరమన్నారు. నీటి వనరుల లభ్యత తగ్గుతూ, వినియోగం పెరుగుతున్న తరుణంలో మురుగునీటిని సైతం శుద్ధిచేసి ప్రత్యేక అవసరాలకు వినియోగించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సదస్సులో పాల్గొన్న వారికి ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే విధంగా ఐఐపీఈ ప్రయోగశాలలను సందర్శించారు. మురుగనీటి పునర్వినియోగంలో ఎదురయ్యే సవాళ్లపై చర్చ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐఎన్ఎల్ ప్రతినిధి జి.ఫణికుమార్, సదస్సు కన్వీనర్ డాక్టర్ రవికుమార్ సోన్వాని పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



సీతంపేటలో కరపత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి వాసుదేవనగర్ 256 సచివాలయం పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ తదితరులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పనితీరుపై సర్వే తీసుకుని, వారి ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. సచివాలయ కన్వీనర్ యు.కుమారి, గృహసారథులు పి.కొండమ్మ, ఆర్.దయామణి, వలంటీర్ సుమలత, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

25వ వార్డులో చురుగ్గా..

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో సోమవారం 133, 134 సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజా మద్దతు సర్వేలో స్థానికులను ప్రశ్నలకు సమాధానాలు అడిగి తెలుసుకుని కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు బోనుల జయ, బొమ్మాళి రవి, పువ్వాడ గోవిందమ్మ, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ జగన్ బాబే రావాలి..



సీఎం వైఎస్ జగన్ పాలనపై అభిప్రాయం తెలియజేస్తున్న చిన అప్పలమ్మ

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వాసుదేవనగర్ వాసి చిన అప్పలమ్మ మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చాలా బాగా పనిచేస్తోందని కితాబిచ్చింది. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్ ఇంటికి వచ్చి తలుపు తట్టి పెన్షన్ సొమ్ము అందిస్తోందని ఆనందం వ్యక్తం చేసింది. తనకు పెన్షన్ ఇచ్చి ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్ బాబుకే తమ ఓటు అని ఆమె తెలిపింది.

జ్ఞానవిస్తృతికి ఐఎస్‌టీడీ కృషి



మాట్లాడుతున్న ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్ చైర్మన్ రావ్

మురళీనగర్: జ్ఞానవిస్తృతిని పెంచడమే ప్రధాన లక్ష్యంగా ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ పనిచేస్తోందని ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఓఎం రావ్ తెలిపారు. ఐఎస్‌టీడీ 53వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 52 చాప్టర్లు ఉన్నాయని, వైజాగ్ చాప్టర్‌లో వివిధ సాంకేతిక విభాగాల్లో ఉన్నత పదవుల్లో పనిచేసిన 600 మంది ప్రముఖులు సభ్యులుగా ఉన్నట్లు చెప్పారు. కాలేజీల్లో ఏర్పాటు చేసిన స్టూడెంట్ చాప్టర్ల ద్వారా వీరు విద్యార్థులకు వారి సబ్జెక్టుతోపాటు నైపుణ్యాల సాధనకు అవసరమైన పరిజ్ఞానాన్ని అందిస్తారని వివరించారు. ఒకరికొకరు పరిచయం చేసుకోవడం ద్వారా నాలెడ్జ్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ సులువవుతుందన్నారు. సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మారుతున్న సాంకేతిక విధానాలకు అవసరమైన జ్ఞానసముపార్జన ఉండాలన్నారు. ఈ చాప్టర్ల ద్వారా నిపుణుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు డాక్టర్ రావ్ సూచించారు. వారు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కెమికల్ విభాగం హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

మద్యం తాగిన వాహన చోదకులపై కేసులు, జరిమానా



వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు

మర్రిపాలెం: గత పది రోజులుగా కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు కంచరపాలెం, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి 11 గంటల నుంచి సోమవారం తెల్లవారు వరకు జ్ఞానాపురం బ్రిడ్జి నుంచి కంచరపాలెం మెట్టు వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. లారీలు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలపై కొరడా ఝుళిపించారు. ఈ పది రోజుల్లో 48 మందిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశామని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. అందులో 27 మందిని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రూ.33 వేలు జరిమానా విధించినట్టు చెప్పారు. రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు ముందస్తు చర్యగా స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. గతంలో జరిమానాలు విధించి కట్టని వాహన చోదకుల నుంచి వసూలు చేశామన్నారు. ఎస్ఐలు వాసుదేవరావు, పాపారావు, ఉల్‌హక్ ప్రత్యేక బృందాలుగా తనిఖీ చేపట్టారని సీఐ తెలిపారు.

మర్రిపాలెం రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: మర్రిపాలెం రైల్వే స్టేషన్ సమీపంలోని ఓర్ ఎక్స్ఛేంజ్ కాంప్లెక్స్ దగ్గర సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. వివరాలిలా.. సుమారు 30–35 ఏళ్ల వ్యక్తి మర్రిపాలెం స్టేషన్ సమీపంలో సోమవారం కరెంటు షాక్ వల్ల చనిపోయాడు. ఈ వ్యక్తి ఏదైనా గూడ్స్ రైలుపై నుంచి విద్యుత్ వైర్లను పట్టుకోవడం వల్ల, కరెంట్ షాక్ తగలడం వల్ల లేదా మరే ఇతర కారణాల వల్ల అయిన మరణించి ఉండవచ్చు. ఈ వ్యక్తి బూడిద రంగు ప్యాంట్ మీద తెలుపు రంగు డాట్స్‌తో కూడిన ప్యాంట్, నీలం రంగు నిక్కరు ధరించి ఉన్నాడు. విద్యుత్ షాక్ వల్ల శరీరం నల్లబడిపోయింది. గవర్నమెంట్ రైల్వే పోలీస్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు సూచనలతో ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ స్టేషన్ వద్ద స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్లలో తెలియజేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు వార్డులకు చెందిన ప్రజలు ఆయన కు తమ సమస్యపై వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్నింటిని తక్షణం పరిష్కరించారు. మరికొన్ని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పోటీ పరీక్షలకు సమ్మర్ కామన్ కోచింగ్

డాబాగార్డెన్స్: అన్ని పోటీ పరీక్షలకు అవసరమయ్యేలా సమ్మర్ కామన్ కోచింగ్ ప్రారంభించనున్నట్టు అల్లూరి స్టడీ సర్కిల్ నిర్వాహకుడు కె.అభిమన్యు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాలయాల ప్రవేశాలకు ఉపయోగపడేలా ఈ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 2 నెలల పాటు నిర్వహించే ఈ తరగతులు వేసవి సెలవుల్లో యువత సమయాన్ని వృథా చేయకుండా, అభివృద్ధికి దోహదం చేసేలా ఉంటాయన్నారు. విద్యాలయాల ప్రవేశ పరీక్షల్లోను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు కామన్‌గా ఉండే ఇంగ్లిష్ లాంగ్వేజ్, అర్థమెటిక్, రీజనింగ్, జీకే, కరెంట్ అఫైర్స్ సబ్జెక్టులు బోధిస్తారని తెలిపారు. మరింత సమాచారం కోసం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి స్టడీ సర్కిల్లో స్వయంగా, లేదా 80084 12798 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చు.